క్లుప్తంగా

వీఆర్‌ఓ కుటుంబానికి పరామర్శ



సింహాచలం కుటుంబాన్ని పరామర్శిస్తున్న సాయికుమార్

జి.సిగడాం: మండలంలో పున్నాం గ్రామానికి చెందిన వీఆర్‌ఓ పిన్నింటి సింహాచలం తల్లి ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని ఆదివారం వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, ఆబోతుల జగన్నాథం, చిక్కాల ధర్మారావు, యర్రవరం మాజీ ఎంపీటీసీ మింది శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించారు.

కూర్మనాథున్ని దర్శించుకున్న జీఎస్టీ కమిషనర్



స్వామి సన్నిధిలో శ్రీరామ్

గార: విష్ణుక్షేత్రం శ్రీకూర్మంలోని కూర్మనాథున్ని సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ (విశాఖపట్నం) శ్రీరామ్ ఆదివారం సాయంత్రం దర్శించుకున్నారు. మూలవిరాట్ వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ప్రధానార్చకులు చామర్తి సీతారామ నృసింహాచార్యులు క్షేత్ర మహాత్యాన్ని వివరించారు. ఆలయ ఈవో జి.గురునాథం క్షేత్ర ప్రసాదం అందజేశారు.

మురపాకలో చెరువుల వేలం



వేలం పాట నిర్వహిస్తున్న దృశ్యం

లావేరు: మురపాక పంచాయతీ పరిధిలోని చెరువుల్లో 2023–24 సంవత్సరంలో చేపల పెంపకానికి ఆదివారం వేలం పాట నిర్వహించారు. ఐదు చెరువులకు రూ.4,73,500 పంచాయతీకు ఆదాయం వచ్చిందని మురపాక సచివాలయం కన్వీనర్ బాలి శ్రీనివాసనాయుడు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కె.వి.ప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు పెయ్యల లక్ష్మణరావు, తేనెల విద్యాసాగర్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అన్నదానం



అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

అరసవల్లి: నగరంలోని బెహరా మనోవికాస కేంద్రంలో మానసిక దివ్యాంగులకు ఫ్రెండ్‌షిప్ డే శుభాకాంక్షలు తెలియజేస్తూ..ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అరసవల్లికి చెందిన ఉంగటి పాపారావు ఆధ్వర్యంలో 75 మంది పిల్లలకు అన్నదానం, స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఉంగటి రామ్మోహనరావు, కునుకు గోవింద్, సీర చిన్నారావు, అప్పన్న, సంతు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మోహన్‌కు విశిష్ట పురస్కారం



నటుకుల మోహన్‌కు పురస్కారం అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్/శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): డిస్ట్రిక్ట్ 316ఎ యాన్యువల్ అవార్డ్స్ సందర్భంగా లయన్స్ ఇంటర్నేషనల్ శ్రీకాకుళం జోనల్ చైర్మన్, శ్రీకాకుళం లయన్స్ క్లబ్ రీజనల్ చైర్‌పర్సన్ నటుకుల మోహన్ విశిష్ట పురస్కారం అందుకున్నారు. ఆదివారం విశాఖపట్నంలో జరిగిన 2023 వార్షిక బహుమతి ప్రదానోత్సవంలో ఈ అవార్డును మోహన్‌కు అందజేశారు.

గద్దర్ మృతి తీరని లోటు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)/శ్రీకాకుళం కల్చరల్: ప్రజాపాటల యుద్ధనౌక, సాంస్కృతికోద్యమంలో 40 ఏళ్లుగా ప్రజాబాహుల్యాన్ని చైతన్యపరిచిన విప్లవ రచయిత గద్దర్ మృతి తీరని లోటని దళిత సంఘాల జేఏసీ నేత డాక్టర్ కంఠ వేణు అన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. దళిత, ఆదివాసీల రక్షణ కవచంగా ఉన్న అట్రాసిటీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేయాలనుకున్న సందర్భంలో 2018లో ప్రజాచైతన్యపోరు యాత్రలో పాల్గొని శ్రీకాకుళం బహుజనులను ఉత్తేజపరిచారని గుర్తు చేశారు. ఆయన ఆత్మకు శాంతిచేకూరాలని కోరారు.గద్దర్ మృతి పట్ల ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు, అరసం జిల్లా అధ్యక్షుడు నల్లి ధర్మారావు, గిడుగు జానపద పీఠం అధ్యక్షుడు బద్రి కూర్మారావు సంతాపం తెలియజేశారు.

స్నేహమేరా జీవితం..!

- ఆపదలో ఆదుకున్న వారే నిజమైన స్నేహితులు
- ఘనంగా స్నేహితుల దినోత్సవం

శ్రీకాకుళం అర్బన్: ఆస్తులు లేని వారు పేదవారు కాదని, ఆపదలో ఆదుకునే స్నేహితులు లేనివారే నిజమైన పేదవారు అని లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షుడు లయన్ పొన్నాడ రవికుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని లయన్స్ క్లబ్ కార్యాలయంలో ఆదివారం స్నేహితుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ మెంటార్ లయన్ నటుకుల మోహన్ కేక్ కట్ చేసి సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జోన్ చైర్‌పర్సన్ డాక్టర్ బాడాన దేవభూషణరావు, క్లబ్ ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ డి.విష్ణుమూర్తి, సెక్రటరీ రాంగోపాల్, కోశాధికారి శిల్లా మణి, క్లబ్ అడ్మినిస్ట్రేటివ్ ప్రొఫెసర్ జి.రామకృష్ణ, సభ్యులు సీహెచ్.ఈశ్వరరావు, పొడుగు చరణ్, లయన్ భగవత్ సింగ్, లయన్ రాజు తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ఒకేచోట కలిసిన పూర్వ విద్యార్థులు, కుటుంబ సభ్యులు

స్నేహమంటే ఇదేరా..

శ్రీకాకుళం కల్చరల్: పట్టణంలో స్నేహితుల దినోత్సవాన్ని ఆదివారం సందడిగా జరుపుకొన్నారు. మిత్రులంతా ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నగరంలోని ఎన్‌జీవో హోం పక్కన ఉన్న విజయనానంద్ భవనంలో 1975–76 ఎం హెచ్ స్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లు కట్టుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఫల్గుణరావు, గోపాల్, శ్యామసుందర్, కామేశ్వరరావు, శారద తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): హిరమండలంలో 1986–1993 మధ్య చదివిన విద్యార్థులంతా ప్రపంచ స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆదివారం శ్రీకాకుళం నగరంలో ఓ ప్రయివేటు ఫంక్షన్ హాల్‌లో కలిశారు. ఆనాటి జ్ఞాపకాలను ఒకరితో ఒకరు పంచుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి రాజారెడ్డి వారణాసి మాట్లాడుతూ వరుసగా నాలుగో ఏట స్నేహితుల దినోత్సవం నాటు పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆంధ్రా, ఒడిశా, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 80 మంది పూర్వ విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వస్త్రాల పంపిణీ

శ్రీకాకుళం అర్బన్: జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ సీనియర్ మెంబర్స్ అసోసియేషన్ శ్రీకాకుళం ఆధ్వర్యంలో ఆదివారం వైఎస్సార్ కూడలి వద్ద 108 సిబ్బందికి నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జేసీఐ ఎస్‌ఎంఏ అధ్యక్షుడు పోలుమహంతి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ జీవితంలో స్నేహానికి ఉన్న విలువ, గౌరవం, విశ్వాసం దేనికీ లేదన్నారు. జీవితానికి స్నేహమే వెలుగునిచ్చే వెన్నెల అని పేర్కొన్నారు. జేసీఐ ఎస్‌ఎంఏ సెనేటర్ నటుకుల మోహన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ ఫిజియోథెరపిస్టు డాక్టర్ బగ్గాం శ్రీనివాస్ పట్నాయక్, లయన్ మాధవి, జీఎన్ జ్యూయలరీ శ్యామ్, జేసీఐ ఎస్‌ఎంఏ పాలిశెట్టి మధు, ట్రాఫిక్ పోలీసు సిబ్బంది, 108 సిబ్బంది పాల్గొన్నారు.



శ్రీకాకుళం కల్చరల్: సందడిగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



శ్రీకాకుళం అర్బన్: స్నేహితుల దినోత్సవంలో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు



శ్రీకాకుళం అర్బన్: 108 సిబ్బందికి నూతన వస్త్రాలు అందజేసి సన్మానించిన దృశ్యం

పరబ్రహ్మ తత్త్వమే సచ్చిదానందం

శ్రీకాకుళం కల్చరల్: పరబ్రహ్మ తత్త్వమే సచ్చిదానంద రూపమని డాక్టర్ ససపల నారాయణమూర్తి అన్నారు. స్థానిక ఉపనిషన్మందిరంలో ఆదివారం సచ్చిదానందంపై ఉపన్యాసం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్, చిత్, ఆనంద.. ఈమూడు స్వరూపాలే పరబ్రహ్మమని వివరించారు. కార్యక్రమంలో మందిరం సభ్యులు పతంజలి శాస్త్రి, ఎన్.నరసింహమూర్తి, వెంకటరమణ, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.



నారాయణమూర్తిని సత్కరిస్తున్న మందిరం సభ్యులు

బీజామృతంతో వరినారు శుద్ధి

జి.సిగడాం: వరిసాగులో బీజామృతం వినియోగిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని నేచురల్ మాస్టర్ రాజేష్ అన్నారు. ఆదివారం ముషినివలసలో అలబోయిన రాము వ్యవసాయ క్షేత్రంలో బీజామృతంతో వరినారు శుద్ధి చేసే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్రావణాలు, కషాయాల ద్వారా వ్యవసాయం చేస్తే సుస్థిర దిగుబడులు, సురక్షిత ఆరోగ్యం సాధించవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయంతో సాగు చేసుకుంటే తక్కువ పెట్టుబడి, అధిక దిగుబడులు పొందవచ్చని చెప్పారు. బీజామృతం, ఘన జీవామృతం, ద్రవ జీవామృతం, నీమాస్త్రం, వావిలాకు కషాయం, తూటికాడ కషాయం, బ్రహ్మాస్త్రం, అగ్నిఅస్త్రం, మారేడు పత్రం కషాయాలను తక్కువ ఖర్చుతో తయారు చేసుకోవచ్చన్నారు.



అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

చురుగ్గా ఇంటింటా ఓటరు సర్వే



రణస్థలంలో సర్వేలో పాల్గొన్న పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్

రణస్థలం: గ్రామాల్లో ఇంటింటా ఓటరు పరిశీలన సర్వే చురుగ్గా సాగుతోందని రణస్థలం పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ తెలిపారు. మండలంలో 28 గ్రామ సచివాలయ పరిధిలో సర్వే జరుగుతోందని చెప్పారు. ఈ నెల 21లోపు శతశాతం సర్వే పూర్తి చేయాలనే సంకల్పంతో బూత్ లెవెల్ అధికారులు పని చేస్తున్నారని పేర్కొన్నారు. ఓటర్ల చేర్పులు, మార్పులు, తొలగింపుల అన్నీ గ్రామ స్థాయిలో వివిధ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పక్కాగా జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో బూత్ ఏజెంట్లు జి.వరంనాయుడు, పసుపురెడ్డి సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

కొంగరాంలో తల్లిపాల వారోత్సవాలు



పోషణ కిట్లు పంపిణీ చేసిన దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని కొంగరాం అంగన్‌వాడీ కేంద్రంలో ఆదివారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. సర్పంచ్ గుండ భాగ్యశ్రీ తల్లి పాల ప్రాధాన్యత వివరించారు. తల్లిపాలతో బిడ్డకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అనంతరం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రవి, ఐసీడీఎస్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

తైక్వాండో క్రీడాకారిణికి అభినందన

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ తైక్వాండో పోటీల్లో పతకం సాధించిన వారణాసి హిమశ్రీని జిల్లా తైక్వాండో అసోసియేషన్ సత్కరించింది. ఉత్తరప్రదేశ్‌లోని లక్నో వేదికగా జూలై 28 నుంచి 30వ తేదీ వరకు 6వ జాతీయస్థాయి బాలబాలికల తైక్వాండో చాంపియన్‌షిప్–2023 పోటీలు జరిగాయి. ఇందులో హిమశ్రీ కేడెట్ అండర్–172 సెంటీమీటర్ల విభాగంలో రజత పతకం సాధించి మెరిసింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తైక్వాండో శ్రీను ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని టౌన్ హాల్ వేదికగా హిమశ్రీని, కోచ్ నీలంశెట్టి రవిని సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. వాస్తవానికి హిమశ్రీ స్వస్థలం విజయనగరం అయినప్పటికీ శ్రీకాకుళంకు చెందిన తైక్వాండో కోచ్ రవి వద్ద శిక్షణ తీసుకుంటోంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని వారణాసి హిమశ్రీ తన క్రీడా నేపథ్యాన్ని టౌన్‌హాల్‌లో తైక్వాండో సాధన చేస్తున్న క్రీడాకారులతో పంచుకుంది. కార్యక్రమంలో తైక్వాండో కోచ్‌లు గౌతు నవీన్, సతీష్, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.



వారణాసి హిమశ్రీ, కోచ్ రవిని సత్కరిస్తున్న తైక్వాండో శ్రీను, కోచ్‌లు

అరసవల్లిలో భక్తజనం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని అధిక శ్రావణ ఆదివారాన భక్తులు పెద్ద సంఖ్యలో దర్శనానికి విచ్చేశారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మొక్కులు చెల్లించుకుని స్వామి దర్శనాలకు బారులు తీరారు. కేశఖండన శాలలో తలనీలాలకు అదనపు డబ్బులు వసూళ్లు చేయకుండా ప్రత్యేక సిబ్బందిని నియమించడంతో పాటు ఆడియో రికార్డును వినిపించడంతో దాదాపుగా అదనపు వసూళ్ల ఇబ్బందులు తగ్గాయి. అంతరాలయంలో స్వామి వారికి ప్రత్యేక అలంకరణతో దర్శనమిచ్చారు. ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఉచిత మంచినీరు, ఉచిత వైద్య సదుపాయాలతో పాటు ఉచిత ప్రసాదాలను ఈవో వి.హరిసూర్యప్రకాష్ అందజేశారు. రూ.500 విశిష్ట దర్శనాలతో పాటు రూ.100 ప్రత్యేక దర్శనాల లైన్లలో భక్తులు దర్శనాలు చేసుకున్నారు. కొత్తగా రూ.300తో ఆలయ మండపాల్లోని సూర్యనమస్కార పూజలకు ఎగ్జిట్ ద్వారం నుంచి ప్రత్యేకంగా అనుమతివ్వడంతో భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. పలువురు జిల్లా స్థాయి అధికారులు ఆదిత్యున్ని దర్శించుకున్నారు.

ఉచిత హోమియో మందుల పంపిణీ..

ఆలయంలో దర్శనానికి వచ్చిన భక్తులకు అవసరం మేరకు ఉచితంగా హోమియో మందులను మహలక్ష్మి హోమియో క్లినిక్ డాక్టర్ పూజారి స్వాతి ఆధ్వర్యంలో వందలాది మంది భక్తులకు ఉచితంగా మందులు అందజేశారు. ప్రత్యేక చికిత్సలపై వివరించారు. ఎలాంటి సైడ్‌ఎఫెక్ట్స్ లేని వైద్య విధానం ఇదని, రోగనిరోధక శక్తిని పెంచేలా చికిత్సలుంటాయని డాక్టర్ స్వాతి వివరించారు.



సూర్యనమస్కార పూజలు చేయించుకుంటున్న భక్తులు



ఉచిత వైద్య చికిత్సలు అందిస్తున్న డాక్టర్ స్వాతి

విద్యుత్, వంశధార ఇంజినీర్లపై చర్యలు తీసుకోవాలి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): గార మండలం చల్లపేట సబ్‌స్టేషన్‌లో 5 మెగావాట్స్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి నెల రోజులు గడుస్తున్నా నేటికి విద్యుత్‌శాఖ ఎస్‌ఈ, ఈఈ, ఏఈలు పట్టించుకోకుండా గార, రూరల్ మండల రైతులకు ఇబ్బందిపెట్టడం సరికాదని అగ్రిమిషన్ మెంబర్ గొండు రఘురాం, అంబటి శ్రీనివాసరావు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం టౌన్ హాల్‌లో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చల్లపేట దిగువ ప్రాంతంలో ఉన్న రైతులు వ్యవసాయ మోటార్ల లోవోల్టేజీ సమస్య వల్ల బోర్లు పనిచేయడం లేదన్నారు. సాగుకు నీరందక వరి నాట్లు వేసుకోలేని పరిస్థితిలో ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలో విద్యుత్ ఆధారిత గ్రామాలు అధికంగా ఉండటంతో ముమ్మరంగా వ్యవసాయం పనులు జరుగుతున్నాయని, ఈ సమయంలో కరెంట్ సమస్యలు పరిష్కరించకపోవడం తగదన్నారు. ఇదే విషయమై మంత్రి ధర్మాన ప్రసాదరావు దృష్టికి గార, రూరల్ మండల నాయకులు తీసుకెళ్లడంతో వెంటనే ఎలక్ట్రికల్ సీఎండీతో మాట్లాడారని, రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని చెప్పారని, అయినా కార్యరూపం దాల్చలేదన్నారు. సమస్య పరిష్కారం కాకుంటే రైతులతో కలిసి సబ్‌స్టేషన్‌ను ముట్టడిస్తామన్నారు. అంతేకాకుండా వంశధార మెయిన్ కెనాల్ నుంచి 300 క్యూసెక్కులు నీరు దిగువ ప్రాంతాలకు రావాల్సి ఉండగా 140 క్యూసెక్కులు మాత్రమే వస్తోందని, శివారు ప్రాంతాలకు నీరు అందడం లేదని చెప్పారు. గుర్రపుడెక్క తీయాలని పలుమార్లు వంశధార ఇంజనీర్లకు తెలియజేసినా కనీసం పట్టించుకోలేదని మండిపడ్డారు. తక్షణమే కలెక్టర్ స్పందించి విద్యుత్‌శాఖ, వంశధార ఇంజనీర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో గార మండల కన్వీనర్ పీస గోపి, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ ముంజేటి కృష్ణమూర్తి, అరవల రామకృష్ణ, కొయ్యాన నాగభూషణం, సర్పంచ్ ప్రతినిధి తమ్మిన అప్పలరాజు తదిరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అగ్రిమిషన్ సభ్యుడు గొండు రఘురాం

నేడు జి.సిగడాంలో ఎమ్మెల్యే పర్యటన

జి.సిగడాం: మండలంలోని సంతవురిటి, విజయరాంపురం, ఆనందపురం గ్రామాల్లో సోమవారం ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పర్యటిస్తారని ఎంపీపీ మీసాల సత్యవతి ఆదివారం తెలిపారు. ఉదయం 10 గంటలకు ఆనందపురం గ్రామ సచివాలయం ప్రారంభోత్సం, 11 గంటలకు ధవళపేట పంచాయతీ విజయరాంపురంలో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ భవనం ప్రారంభం, మధ్యాహ్నం 1:30 గంటలకు సంతవురిటి ఎస్సీ కాలనీలో నిర్మించిన కమ్యూనిటీ భవనం, రైతుభరోసా కేంద్రం, ఆరోగ్య కేంద్రం, మన ఊరు కృష్ణా పార్కును ప్రారంభిస్తారని వివరించారు. పార్టీ శ్రేణులు, అధికారులు హాజరుకావాలని కోరారు.



సంతవురిటిలో ప్రారంభానికి సిద్ధంగా కృష్ణా పార్కు

న్యాయవాదికి సత్కారం

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం నగరానికి చెందిన ప్రముఖ న్యాయవాది, రోటరీ క్లబ్ అధ్యక్షుడు యెరుకోల మురళి మోహన్‌రావును క్లబ్ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. విజయనగరం జిల్లా కేంద్రంలో ఆదివారం రోటరీ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 3020 ఆధ్వర్యంలో సమ్మోహనం పేరిట డిస్ట్రిక్ట్ మెంబర్‌షిప్ సెమినార్ నిర్వహించారు. ఇందులో 2023–24 ఏడాదికి గాను అత్యధికంగా క్లబ్ మెంబర్‌షిప్‌లను చేయించినందుకు మురళీమోహనరావుకు షీల్డ్, ప్రశంసా పత్రం, పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమంలో పూర్వపు డిస్ట్రిక్ట్ గవర్నర్లు ఎల్.సత్యనారాయణ, సీహెచ్ కిషోర్‌కుమార్, ఎం.రామారావు, వై. కళ్యాణ చక్రవర్తి, రోటరీ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ప్రతినిధులు తమ్మినేని వాసుదేవరావు, కేటి నాయుడు, కె.వి దుర్గారావు, డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావు, ఊణ్ణ సంతోష్ కుమార్, మామిడి క్రాంతి, వారణాసి రావు, సూరు శ్రీనివాసరావు, దేవరశెట్టి శివశంకర్, ఎంఆర్‌కే దాస్, అనంతరావు తదితరులు పాల్గొన్నారు.



మురళీమోహన్‌రావును అభినందిస్తున్న దృశ్యం

ఓంకారమే వేదసారం

గార: ఓం కారమే వేదసారమని, ఆనందమే బ్రహ్మ అని సత్యసాయి ఆధ్యాత్మిక సంస్థజిల్లా కో ఆర్డినేటర్ పడాల ప్రసాదరావు అన్నారు. శ్రీకూర్మం సత్యసాయి భజన మందిరంలో ఆధ్యాత్మిక విభాగం ఆధ్వర్యంలో సాధన శిబిరం నిర్వహించారు. సత్యసాయి బాబాను దర్శించాలని, ఆయన లీలలను, అవతార వైభవాన్ని వివరించారు. బాల వికాస్ జిల్లా ఇన్‌చార్జి సురేష్ మాస్టర్ మాట్లాడుతూ ప్రతి జీవిలోనూ శబ్దం ఉందని, అదే ఓంకారమన్నారు. కార్యక్రమంలో సాధన కో–ఆర్డినేటర్ జె.శ్రీనివాసరావు, ఆమదాలవలస జోనల్ కన్వీనర్ పి.జనార్ధన, లిఖిత, బోయన నరసింహమూర్తి, ఏ.శివకుమార్, విద్య జ్యోతి, రామారావు సాయి, శ్రీకూర్మం, గార, బోరవానిపేట, కొర్ని, సతివాడ, గోరువానిపేట, యాళ్లపేట భజన మండళ్ల కన్వీనర్లు పాల్గొన్నారు.



శిబిరంలో మాట్లాడుతున్న జిల్లా కో ఆర్డినేటర్ పడాల ప్రసాదరావు

వసతిగృహాల్లో 418 సీట్లు భర్తీ

నరసన్నపేట: నియోజకవర్గంలోని 11 వసతి గృహాల్లో 418 సీట్లను భర్తీ చేశారు. వసతి గృహాల్లో ఉన్న ఖాళీల భర్తీకి ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అధ్యక్షతన సమావేశం ఆదివారం నిర్వహించారు. దీంట్లో ఎనిమిది బీసీ వసతి గృహాల్లో 359, మూడు ఎస్సీ వసతి గృహాల్లో 59 సీట్లు భర్తీ అయ్యాయి. నరసన్నపేట బీసీ బాలికల కళాశాల వసతి గృహంలో 93, దేశవానిపేటలో 93, ప్రియాగ్రహారంలో 24, జలుమూరులో 24, పోలాకిలో 43, ఉర్లాంలో 25, బాలురు కళాశాల వసతి గృహంలో 58, శ్రీముఖలింగంలో 21 సీట్లను భర్తీ చేశారు. ఎస్సీ వసతి గృహాలకు సంబంధించి నరసన్నపేటలో ఎస్సీ బాలికల వసతి గృహంలో 23, కోదూరులో 19, జలుమూరులో 17 సీట్లు భర్తీ అయ్యాయి. సమావేశంలో బీసీ ఏఎస్‌డబ్ల్యూ త్రినాథరావు, వసతి గృహాల మేట్రిన్లు, వార్డెన్లు పాల్గొన్నారు.

గురు పురస్కారాలు ప్రదానం

శ్రీకాకుళం కల్చరల్: పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో అఖిల భారత బ్రాహ్మణ మహాసంఘం ఆధ్వర్యంలో ఆదివారం గురు పురస్కారాల ప్రదానం నిర్వహించారు. మొత్తం 80 మందికి పురస్కారాలతో సత్కరించగా అందులో జిల్లాకు చెందిన అలివేలు మంగతాయారుకు తంత్రజ్ఞభూషణ బిరుదు, డాక్టర్ ఆరవెల్లి ఫణికుమార్‌కు దైవజ్ఞ ఫణిభూషణ బిరుదు, పట్నాల అనంత నరసింహమూర్తికి నవరస నటనా చతుర బిరుదుతో సత్కరించారని భాస్కరభట్ల శ్రీరామమూర్తి తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ఇంద్రకంటి ప్రసాద్ శర్మ సిద్ధాంతి, కార్యదర్శి జగదీశ్వరరావు, ఏలూరు అధ్యక్షుడు గురుశర్మ మైలవరపు, శ్రీనివాస రామానుజాచార్యులు, వనజ రమణి తదితరులు పాల్గొన్నారు.



అలివేలు మంగతాయారును సత్కరిస్తున్న దృశ్యం

చిన్నారులకు ఆటల పోటీలు

శ్రీకాకుళం కల్చరల్: పాత శ్రీకాకుళంలో చిల్డ్రన్స్ లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం చిన్నారులకు గ్లాసుల బిల్డ్ ఆటల పోటీలు జరిగాయి. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో క్లబ్ నిర్వాహకులు ఎల్.నందికేశ్వరరావు, బీఎంఎస్ పట్నాయక్, ప్రసాద్, ఎల్.దీప్తి పాల్గొన్నారు.